TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 279 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.05.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు



కూసుమంచి :అమృత్ తెలంగాణ: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు.

వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నా మని తెలిపారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## ఆరు దశాబ్దాల చరిత్రకు బ్రేక్..



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తమిళనాడు రాజకీయాల్లో ఒక ఊహించని బ్లాక్‌బస్టర్... ఎవరూ అంచనా వేయని ఒక అద్భుతమైన స్క్రిప్ట్ ఆవిష్కృతమైంది. ఆరు దశాబ్దాలకు పైగా ద్రవిడ పార్టీల ఆధిపత్యంలో ఉన్న రాజకీయ చరిత్రను తిరగరాస్తూ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) చారిత్రక విజయం దిశగా దూసుకెళుతోంది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి, అధికారాన్ని కైవసం చేసుకునే అంచున నిలిచి, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మధ్యాహ్నం 1 గంట సమయానికి టీవీకే రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు గానూ 107 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మేజిక్ ఫిగర్‌కు కేవలం 11 సీట్ల దూరంలో నిలిచింది. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ద్రవిడ దిగ్గజాల మధ్య నూతన శక్తిగా బరిలోకి దిగిన టీవీకే, అందరి అంచనాలను తలకిందులు చేసింది. 1962లో కె. కామరాజ్ నేతృత్వంలోని కాంగ్రెస్ తర్వాత తమిళనాడులో ఒక ద్రవిడేతర పార్టీ అధికారం చేపట్టడం ఇదే ప్రథమం కానుంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఈ ఎన్నికల్లో ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అయితే, ద్రవిడ పార్టీలకు ప్రత్యామ్నాయం లేదనుకున్న ఓటర్లకు విజయ్ ఒక కొత్త 'ఎంపిక'ను అందించారు. పెరియార్ సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని తన ప్రచారంలో జోడించి, డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై, ఏఐఏడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ ఆశీస్సులు తనకు ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు..ఏ పార్టీకి ఎన్ని స్థానాలు




హైదరాబాద్:అమృత్ తెలంగాణ: ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలల్లో బీజేపీ(అసోం, పశ్చిమ బెంగాల్, యూటీ పుదుచ్చేరి) మూడు, కాంగ్రెస్ ఒకటి(కేరళం) దక్కించుకున్నాయి. తమిళనాడులో టీవీకే అధినేత విజయ్ అఖండ విజయం సాధించారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ ముగియనుంది. ఇప్పటికే ఆధిక్యతతో ఆయా రాష్ట్రాల్లో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి రానుందో తెలిపోయింది. కాగా, కేరళ, అసోం, పుదుచ్చేరిలో ఓట్ల లెక్కింపు దాదాపు ముగిసింది. ఇక బెంగాల్, తమళనాడు లెక్కింపు కొనసాగుతుంది.

కేరళంలో మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు యూడీఎఫ్‌కు 102 గెలుపొంది అధికారం చేపట్టనుంది. ఎల్‌డీఎఫ్ 35, ఎన్డేయే మూడు గెలుచుకున్నాయి.

అసోంలో 126 అసెంబ్లీ సీట్లకు బీజేపీ 102 స్థానాలను కైవసం చేసుకోని మరోసారి అధికారం నిలుపుకుంది. కాంగ్రెస్ 21, ఏఐయూడీఎఫ్ 2, ఇతరులు ఒక స్థానంలో గెలిచారు.

పుదుచ్చేరి(30)లో ఎన్నార్ కాంగ్రెస్ 10, బీజేపీ 4, డీఎంకే 5, టీవీకే 2, ఎల్‌జేకే, అన్నా డీఎంకే, కాంగ్రెస్, నెయ్యం మక్కల్ కళగమ్ తలా ఒక్క స్థానం కైవసం చేసుకున్నాయి. ఇతరులు 3 సీట్లల్లో గెలుపొందారు.

పశ్చిమ బెంగాల్(294): బీజేపీ 180 సీట్లను గెలువగా, 27 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 68 స్థానాలను గెలిచి, 12 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతుంది. కాంగ్రెస్ 2, వాపక్షాలు రెండు, ఇతరులు రెండు స్థానాల్లో గెలుపొందారు.

తమిళనాడు(234): టీవీకే 95 స్థానాలను గెలువగా 11 ఆధిక్యంలో ఉంది. డీఎంకే 58 సీట్లల్లో గెలిచి 16 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అన్నా డీఎంకే 45 స్థానాలు గెలుచుకుంది. 8 సీట్లల్లో ఆధిక్యంలో ఉంది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రేండున్నరేండ్ల కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఇప్పటికే విద్యావ్యవస్థను కుప్పకూలిందని బీఆర్ఎస్ వర్కింగ్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఇప్పుడు ఏకంగా ఉన్నత చదువులకు నిరుపేదలను పూర్తిగా దూరం చేసేలా విద్యార్థులకు వెన్నుపోటు పొడుస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్ర భయంకరమైనదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ ఏడును తెచ్చిందని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఆదివారం లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ అని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందని పేర్కొన్నారు. ఈ జీఓ వచ్చిన క్షణం నుంచి విద్యార్థులకే కాదు, లక్షలాది మంది నిరుపేద తల్లిదండ్రులకు కూడా కంటి మీద కునుకు కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ స్కీంలనే కాకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలనూ పాతరేస్తారా?అని అడిగారు. ఓవైపు గురుకులాలను దెబ్బతీసి ఉన్నత విద్యకూ ఉరివేస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దుర్మార్గమైన జీవో నెంబర్ ఏడును వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద విద్యార్థులతో దండుకట్టి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని తెలిపారు. ఇప్పటికే అన్నదాతల ఆందోళనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో దగాపడ్డ విద్యార్థులు గర్జిస్తే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం: ఎంకే స్టాలిన్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని వీఖ స్టాలిన్ తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల కోసం అనేక ప్రాజెక్టులు, మంచి పాలన అందించామని, ప్రతి దశలోనూ తమిళనాడు ముందుండేలా చూశామని డీఎంకే నాయకుడు తెలిపారు. తాము సాధించిన విజయాలను మాత్రమే ప్రజల ముందు ఉంచి ఓట్లు అభ్యర్థించామని,

ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని కొనసాగిస్తామని హామీ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుందన్న నమ్మకముంది



హైదరాబాద్ .అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న నమ్మకం, విశ్వాసముందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక కృతజ్ఞతలు ప్రకటించారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఈనెల ఐదున తలపెట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనలను వాయిదా వేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను వెంటనే సమర్పించాలని ఆ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని అన్నారు. ఆ నివేదిక ఆధారంగా ఉద్యోగ జేఏసీ నేతలతో చర్చించి వేతన పెరుగుదల (ఫిట్‌మెంట్)ను ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు.


అందులోనే ఐదు డీఏ బకాయిలను కలుపుతారని వివరించారు. జూన్ ఒకటిలోగా రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ కొత్త ఆరోగ్య భద్రత కార్డులను అందజేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న అన్ని వర్గాల వారికి దశల వారీగా వర్తింపజేస్తారని అన్నారు. పెన్షనర్ల బకాయిలకు సంబంధించి వంద రోజుల్లో రూ.ఆరు వేల కోట్లు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. ఇతర బకాయిల కోసం నెలకు రూ.వెయ్యి కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. సీపీఎస్‌పైన విధాన నిర్ణయం తీసుకుంటుందనీ, 2004, సెప్టెంబర్ ఒకటి కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అమలయ్యేలా చూస్తామన్నారని వివరించారు. ఉపముఖ్యమంత్రి భట్టితో కూర్చొని చర్చించి నిర్ణయం తీసుకుందామన్నారని అన్నారు. 63 డిమాండ్లలో 26 పూర్తిగా లేదా పాక్షికంగా నెరవేరాయని వివరించారు.

మిగిలిన 37 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని చెప్పారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని రెండు నెలలకోసారి సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని గుర్తు చేశారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం ముందు ఒక ప్రతిపాదన ఉంచామని అన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు ఏర్పడే ఖాళీలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని డీపీసీ ఒకేసారి ఆమోదించేలా చూడాలన్నారు. దానివల్ల ఖాళీ ఏర్పడిన ప్రతిసారి డీపీసీ వేయాల్సిన అవసరం ఉండబోదని స్పష్టం చేశారు.

## సిరిసిల్లకు డిప్యూటీ సీఎం భట్టి

రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేటకు మంగళవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పోన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పేర్కొన్నారు. ఈనెల 5న ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుండి హెలికాప్టర్ ద్వారా సిరిసిల్ల పర్యటన ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 12:15 గంటలకు గంభీరావుపేట గ్రామానికి మంత్రుల బృందం చేరుకుని, గంభీరావుపేటలో అధికారులు, అనధికారులతో మంత్రుల కీలక సమావేశం కానున్నట్లు ఆయన వెల్లడించారు. మధ్యాహ్నం 12:20 నుండి 1:30 వరకు 'బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్' కంప్రెసెడ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ, గంభీరావుపేటలో రైతులతో ముఖాముఖి, మధ్యాహ్నం 2:00 గంటలకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 33/11 KV సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన, మధ్యాహ్నం 2:30 నుండి 4:00 గంటల వరకు పీజీ సెంటర్‌లో జిల్లా అభివృద్ధి పనులపై మంత్రుల సమీక్షా సమావేశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి వారి ధాన్యము కొనుగోలు చేపట్టాలి:రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యాసంగి వరి ధాన్యము కొనుగోలు చేయాలనీ రాష్ట పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తశీ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రులు పొన్నం ప్రబాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిలా శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషన్ ఇలంబర్తి తో కలిసి ఆయన విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట పౌర సరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ, రాష్టంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పలిన్ కవర్లు, అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తున్నందున రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. గాలులకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియజేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగు నీరు, షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మైచర్ యంత్రాలు, ఆటో మేటిక్ ప్యాడి క్లెనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు పంపించాలని, ఎక్కడ కుడా జాప్యం, చేయకుడదని, హమాలీలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలకు గ్రామ స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. మే నెల చివరి కల్లా 80% ధాన్యము కొనుగోళ్ళు పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, పౌర సరఫరాల శాఖ అధికారులు నందిని, సుధారాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# మీ సేవా కేంద్రాల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మీ సేవా కేంద్రాల నిర్వహణకు సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ మీ సేవా కేంద్రాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2న నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాల ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా అధికారిక వెబ్ సైట్ లో (https:// adilabad.nic.in) అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ అసలు విద్యార్హత సర్టిఫికెట్లు, గుర్తింపు పత్రాలు, ఇతర అవసరమైన ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో రేపు (మంగళవారం) ఉదయం 11.00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇంటర్వ్యూకు ఆలస్యంగా హాజరైన వారు లేదా అవసరమైన ఒరిజినల్ ధృవీకరణ పత్రాలు సమర్పించని వారికి అవకాశం ఇవ్వబడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయపాలన పాటించి, ముందస్తుగా హాజరు కావాలని కోరారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు పాయల్ శంకర్ తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభిస్తున్న సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి కి స్వీట్ తినిపిస్తున్న శాసనసభ్యులు పాయల్ శంకర్ దృశ్యం



మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభిస్తున్న సందర్భంలో రైతుకు శాలువతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ తో కలిసి జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్. బోరంచు శ్రీకాంత్ రెడ్డి . ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం రైతులందరి నుండి జొన్న పంటను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే షెడ్యూల్ కూడా వస్తుందని చెప్పారు రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఏవైనా సమస్యలుంటే రైతులు తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలి : అదనపు కలెక్టర్లు రాజేశ్వర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో కార్యాలయానికి వస్తారని, వారి అర్జీలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును సునిశితంగా పరిశీలించి శాఖల వారీగా సమీక్షించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పింఛన్లు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, భూమికి సంబంధించిన సమస్యలపైనే అధికంగా వినతులు నమోదయ్యాయని వెల్లడించారు. అందిన అర్జీలను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఏవో వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నష్ట పరిహారం వచ్చేలా చేస్తా -తెలంగాణ రాష్ట్ర సీడ్ డెవలప్మెంట్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ & రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి

## బాధితులకు అండగా ఉంటాం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్



బాధితులను ఓదారుస్తున్న దృశ్యం



మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ స్వీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బోథ్ మండలంలోని కన్గుట్ట గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైన మొక్కజొన్న పంటను తెలంగాణ రాష్ట్ర సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి మరియు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ సందర్శించారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, కాయకష్టం చేసి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కాలి బూడిదవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో భారీగా నష్టపోయిన రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వే చేయించి బాధితులను ఆదుకుంటాం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మన ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి అని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని ఆడే గజేందర్ స్పష్టం చేశారు. అన్వేష్ రెడ్డి గారు కూడా స్పందిస్తూ, క్షేత్రస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేసి రైతులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

# పశ్చిమబెంగాల్ గెలుపుతో బిజెపి శ్రేణుల సంబరాలు



నర్సాపూర్ జి మండల కేంద్రంలో బిజెపి నాయకుల సంబరాలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ మే 4 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో ఈరోజు వెలువడిన 5రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం సాధించిన సందర్భంగా బిజెపి నాయకులు సంబరాలు చేశారు.మండల అధ్యక్షులు నరేందర్ మాట్లాడుతూ మోదీ నాయకత్వం లో దేశం లో ఎక్కడ ఎన్నికలు జరిగిన బిజెపి విజయ దుందుబి మోగిస్తుందని, బెంగాల్ లో మమత ఆరాచక పాలనకు అక్కడి ప్రజలు చరమ గీతం పాడారని, అస్సాం, పుదుచ్చేరి లలో రెండవ సారి అధికారం లోకి రావడం చాలా ఆనందకరం అని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ లోకూడా అధికారం దిశాగా అడుగులు వేస్తామని అన్నారు... ఈకార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి రాజేందర్, ప్రధాన కార్యదర్శి మహిపాల్,నాయకులు దత్తురాం, మాజీ ఎంపీటీసీ విజయ్,బీజేవైఎం అధ్యక్షులు పల్లపు రాజు, మాజీ వార్డ్ సభ్యులు సూరపు సాయికృష్ణ, బర్కుంట లక్ష్మణ్, చిట్టి లు పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి సన్మానం




మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి నీ సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి ని ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో అధ్యక్షులు నల్లా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాంత్ రెడ్డి ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి, కోశాదికారి కిష్టారెడ్డి, రెడ్డి బంధువులు నవీన్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, అడ్డి ప్రకాష్ రెడ్డి ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భూమా రెడ్డి, సురేందర్‌రెడ్డి, పోతారెడ్డి, ప్రమోద్‌రెడ్డి, భోజారెడ్డి, భూపతిరెడ్డి, జలేందర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సవేన్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



అమృత్ తెలంగాణ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రైతులు పండించిన ప్రతి పంట ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి చెప్పారు. సోమవారం మండల కేంద్రంతోపాటు కొత్తూరు, వెలుగోముల, చిల్వేర్, మున్నానూర్, వేముల గ్రామాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్లతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి మాట్లాడుతూ. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని చెప్పారు. వడ్లు మొదటి రకం 2389, రెండో రకం 2369 రూపాయలతోపాటు సన్న వడ్లకు 500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు.

# నందిపాడులో ఘనంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట అసోసియేట్ డీన్ డా. జె. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నందిపాడు లో సోమవారం "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పంటల ఎంపిక, సేంద్రియ వ్యవసాయం, వాతావరణ మార్పుల ప్రభావంపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన విభాగం ప్రొఫెసర్, హెడ్ ఐ.వి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చని రైతులకు వివరించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న పంటలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తో పాటు ఇతర ఉద్యాన పంటల సాగుపై రైతులకు ఉన్న సందేహాలకు సమాధానాలు ఇచ్చి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రవంతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు.

# ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 4, 2026: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో ఒక భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ,హొూతూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసినహొూధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన బోధన.. భవితకు నిచ్చెన




అమృత్ తెలంగాణ బీసీ గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ప్రవేశ పరీక్ష లేకుండా పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలలు.. నాణ్యమైన విద్యకు చిరునామాగా మారాయన్నారు. పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నారు. ఆధునిక తరగతి గదులు..విశాలమైన మైదానాలతో పాటు.. నిపుణులైన అధ్యాపకులచే విద్యా బోధన గురుకులాల ప్రత్యేకత అన్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ..

శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి. గురుకులాల్లో క్రీడలకు ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారు. ఉదయం సాయంత్రం శిక్షణ ఇస్తారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం జరుగుతుందన్నారు. ఆంగ్లంలో పట్టు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా విద్యార్థులను సిద్ధం చేయడం జరుగుతుంది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 12వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూనియర్ ఇంటర్మీడియట్‌లో రెగ్యులర్ 5 గ్రూప్ లు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ లతో పాటు 7 గ్రూప్ల వృత్తి విద్యా కోర్సులు (ఒకేషనల్ కోర్స్) లకు దరఖాస్తులు చేసుకోవాలనిస సూచించారు. అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రెగ్యులర్ కోర్సులతో పాటు వృత్తి విద్య కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 146 కాలేజీలలో బాలురకు 12,640 సీట్లు,144 కాలేజీ లలో బాలికలకు 12,080 సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని సెక్రటరీ వెల్లడించారు. బీసీ గురుకులాల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, తమ స్కూల్ ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు ఇస్తే సరిపోతుందని పేర్కొన్నారు.

# వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి



అమృత్ తెలంగాణ వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, బారదాన, లారీల కొరత వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం రోజున ఆలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ను సీపీఐ (ఎం) ఆలేరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు మార్కెట్లో గత 15 రోజులకు పైగా వడ్లు పోసినప్పటికీ ఇప్పటివరకు కాంట కాలేదని, నిన్నటి వరకు భారదాన కొరత వల్ల రైతులు ఎదురుచూశారని ఇప్పుడు లారీల సమస్య వల్ల అంతంత మాత్రమే వడ్లు కొనుగోలు చేస్తున్నారని ఆయన అన్నారు. మార్కెట్లో వచ్చిన వడ్లు తూకం అయి మిల్లుకు పోకుండా మార్కెట్లోనే ఉండడం వలన అనేక మంది రైతులు రోజు వచ్చి స్థలం లేకపోవడం వలన తమ కల్లాలలోనే వడ్లు పోసుకొని ఎదురుచూస్తున్నారని, మార్కెట్లో స్థలం లేకుండా పోవడం వలన ఇక్కడికి తీసుకురాగా కల్లాలలోనే వడ్లు పోసి ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అనుకోకుండా వర్షం పడి రైతులు ఆరుగాలం కష్టపడ్డ శ్రమ వరద నీటి పాలు అవుతుందని దిన దిన గండంగా కాలం గడుపుతున్నారని అన్నారు. మార్కెట్లో రైతులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆలేరు మార్కెట్ యార్డులో వచ్చే ధాన్యం కి సరిపోను సీసీ లేకపోవడం వలన మార్కెట్ అంతా గుంతలు గుంతలు ఉందని, ఈ పరిస్థితుల్లో గడ్డి వర్షం వస్తే మార్కెట్ కు వచ్చిన వరి ఇక్కడే మొల్కెత్తే పరిస్థితి ఉందని వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి ఆలేరు మార్కెట్ యార్డ్ కు సరిపోను సీసీ ని ఏర్పాటు చేసి రైతుల శ్రమను ధాన్యాన్ని కాపాడాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.ఏ. ఇక్బాల్, సీఐటీయూ నాయకులు మొరిగాడి రమేష్,రైతు సంఘం నాయకులు ఘణగాని మల్లేష్,మొరిగాడి అశోక్,రైతులు ఇక్కిరి కొమరయ్య,పూల మహేందర్,బి. పాపిరెడ్డి, లక్కాకుల రమేష్,గాదరి రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రి వైద్యులు సమయపాలన పాటించాలి

అమృత్ తెలంగాణ ఆలేరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. అత్యవసర వైద్య సేవలకోసం వచ్చే రోగులు, గర్భిణీలు, సాధారణ క్షతగాత్రులు ఇలా చాలా మంది సకాలంలో వైద్యులు ఆస్పత్రిలో లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా సోమవారం, గురువారం ప్రభుత్వాస్పత్రికి ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలు వైద్య పరీక్షల నిమిత్తం వస్తుంటారు.

వారికి ఆ ప్రత్యేక రోజుల్లోనే చూస్తుంటారు. అప్పుడు కూడా డాక్టర్లు అందుబాటులో ఉండట్లేదని గర్భిణీలు వాపోతున్నారు. పరీక్షల నిమిత్తం గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉండాల్సి వస్తుందని గర్భిణీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయని, దానివల్ల ఎక్కువ సేపు వేచి ఉండలేకపోతున్నామని, నీరసం ఎక్కువవుతోందని చెబుతున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే వైద్య పరీక్షలు చేసుకున్న రిపోర్టులు కూడా సకాలంలో అందడంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్కానింగ్ వారానికి రెండుసార్లు కాకుండా రెగ్యులర్గా చెయ్యాలని, రిపోర్టులు ఇవ్వాలని గర్భిణిలు కోరారు. సోమవారం ఉదయం 10:45 కు గర్భిణీ స్త్రీలను చూసే గైనకాలజిస్ట్, డాక్టర్ లేక ఆస్పత్రి వరండాలో గర్భిణీలు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మే, జూన్ నెలలలో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వైద్యులు 8:00 కి వచ్చి వైద్య సేవలు అందించాలని, గర్భిణీ స్త్రీలు ఇతర వైద్య చికిత్స కొరకు వచ్చే స్థానికులు కోరుతున్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సకాలంలో హాజరు కావాలని, స్కానింగ్ మిషన్ రిపోర్టు రోజువారీగా ఇవ్వాలని కోరుతూ నవతెలంగాణ దినపత్రిక రిపోర్టర్ యేలుగల కుమార స్వామి ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ స్వప్న రాథోడ్ని వివరణ కోరగా.. తను ప్రత్యేక పరిస్థితుల్లో సెలవులో ఉన్నానని, గైనకాలజిస్ట్, ఇతర వైద్యులు అలసత్వం లేకుండా, సకాలంలో హాజరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.

# పొట్టి నిక్కరులో అందాల వేదిక



2006 నుంచి సినిమా ప్రపంచంలో కొనసాగుతున్న అందాల వేదిక మొదట్లోనే క్యూట్ హీరోయిన్ గా మంచి గుర్తింపును అందుకుంది. అంతేకాకుండా వచ్చిన కొత్తలోనే ఈ బ్యూటీ విభిన్నమైన తరహాలో సినిమాలు చేసుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకుంది. కేవలం మాస్ కమర్షియల్ సినిమాలో మాత్రమే కాకుండా హారర్ సినిమాలు కూడా చేసింది. ముఖ్యంగా రాఘవ లారెన్స్ తో చేసిన ముని సినిమా ఆమెకు బాగా కలిసి వచ్చింది. ఇక తర్వాత వెనక్కి తిరిగి చూసుకోకుండా తమిళ్ తెలుగు అలాగే కన్నడ చిత్ర పరిశ్రమలో వరుసగా అవకాశాలు అందుకుంది. ఆమె కెరీర్ లో పెద్దగా స్టార్ హీరోలతో సినిమాలు చేయకపోయినప్పటికీ కూడా మీడియం రేంజ్ హీరోలతో మాత్రం బాగానే వర్క్ చేసింది. ఇక తెలుగులో అయితే బాణం సినిమాతోనే మంచి నటిగా గుర్తింపు అందుకుంది. అప్పట్లో మాత్రం చాలా క్యూట్ లుక్ తో ఆకట్టుకునేది. కానీ ఇప్పుడు మాత్రం వేదిక పూర్తిస్థాయిలో తన స్టైల్ ను మార్చేసింది. గ్లామరస్ బ్యూటీల నుంచి పోటీ ఎక్కువ రావడంతో ఆమె కూడా గ్లామర్ డోస్ పెంచే ప్రయత్నం చేస్తుంది. మూడు పదుల వయసు దాటినా కూడా ఇంకా 16 ఏళ్ల అమ్మాయి తరహాలోనే కనిపిస్తూ ఉంటుంది. ఇక రీసెంట్ గా అమ్మడు అలాగే పొట్టి జీన్స్ నిక్కర్ లో చాలా అందంగా కనిపించింది. గతంలో బికినీ అందాలతో కూడా మైమరిపించిన బ్యూటీ ఇప్పుడు ఈ లుక్ లో మాత్రం చాలా ఘాటుగా ఉంది అంటూ ఫాలోవర్స్ అయితే పాజిటివ్ గా స్పందిస్తున్నారు. ఇక వేదిక ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా ఇతర ఇండస్ట్రీలో కూడా సినిమాలు చేసుకుంటూ వెళుతోంది. ముఖ్యంగా కన్నడ తమిళ ఇండస్ట్రీలో ఆమెకు వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం అయితే తెలుగు తమిళ్ హిందీలో కలిపి మొత్తంగా 6 సినిమాలో అయితే చేస్తోంది. ముఖ్యంగా తమిళ్ తెలుగులో జంగిల్ అనే ఒక ద్విభాషా సినిమా కూడా చేస్తోంది. అలాగే కొన్ని హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలు చేయడానికి కూడా ఈ బ్యూటీ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

# నివేదా నేచురల్ లుక్స్.. కుర్రాళ్లు క్లీన్ బౌల్డ్..!

కోలీవుడ్ అందాల భామ నివేదా పేతురాజ్ సినిమాలతో ఎంత సందడి చేస్తున్నా తన నో మేకప్ లుక్ తో ఫ్యాన్స్ ని అలరిస్తుంది. సాధారణంగా హీరోయిన్స్ వారి రియల్ ఫేస్ అదే నండి నో మేకప్ లుక్ ని చూపించడానికి ఇష్టపడరు. కానీ నివేదా మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధం. తను షూటింగ్ టైం లోనే మేకప్ తో కనిపిస్తుంది మామూలు టైం లో మాత్రం నో మేకప్ అంటుంది. అంతేనా తన మేకప్ లెస్ పిక్స్ ని సోషల్ మీడియాలో షేర్ చేసి హంగామా చేస్తుంది. హీరోయిన్స్ ని ఎలాగైనా ఇష్టపడే వారి ఫ్యాన్స్ ఈ మేకప్ లెస్ ఫోటోస్ కూడా లైకులు కొట్టేస్తుంటారు. ఈ క్రమంలోనే నివేదా పేతురాజ్ ఈ మేకప్ లెస్ పిక్స్ కి సూపర్ క్రేజ్ ఏర్పడింది. లేటెస్ట్ గా అమ్మడు వైట్ అండ్ వైట్ నైట్ వేర్ లో క్యాజువల్ లుక్ తో ఫోటో షూట్ చేసింది. అలా సరదాగా దిగి తన సోషల్ మీడియాలో షేర్ చేసినట్టు ఉంది. ఇలా షేర్ చేసిందో లేదో అలా ఆమె ఫ్యాన్స్ వాటిని వైరల్ చేయడం మొదలు పెట్టారు. ప్రస్తుతం ఉన్న కథానాయికల్లో సూపర్ టాలెంట్ ఉన్న హీరోయిన్ గా నివేదా తనకు తగిన ఛాన్స్ లు అందుకుంటుంది. తన దాకా వచ్చిన ప్రతి అవకాశాన్ని కాదనకుండా చేస్తూ మెప్పిస్తున్న నివేదా పేతురాజ్ ప్రస్తుతం తెలుగులోనే దూసుకెళ్తుంది. ఆల్రెడీ కోలీవుడ్ లో తన టాలెంట్ చూపించిన అమ్మడు ఇప్పుడు టాలీవుడ్ లో తన సత్తా చాటుతోంది. సినిమాతోనే కాదు తన ఫోటో షూట్స్ తో కూడా తెలుగు ఆడియన్స్ కి మరింత దగ్గర అవుతుంది నివేదా పేతురాజ్. విశ్వక్ సేన్ హీరోగా వస్తున్న ధంకీ సినిమాలో నటిస్తున్న నివేదా ఆ తర్వాత మరో రెండు సినిమాలు డిస్కషన్స్ చేస్తున్నట్టు తెలుస్తుంది. తెలుగు ఆడియన్స్ తనపై చూపిస్తున్న ఈ ప్రేమని ఎగ్జైట్ అవుతున్న నివేదా పేతురాజ్ ఇక్కడ వరుస



ఛాన్స్ లు వస్తే చెన్నై నుంచి హైదరాబాద్ షిఫ్ట్ అవ్వాలని కూడా అనుకుంటుంది. తన నేచురల్ యాక్టింగ్ తో ఇచ్చిన పాత్రలకు పూర్తి న్యాయం చేస్తూ వస్తున్న నివేదా ఈమధ్య గ్లామర్ సైడ్ కూడా చూపించాలని ఫిక్స్ అయినట్టు తెలుస్తుంది. కెరీర్ లో ఫస్ట్ టైం ధంకీ సినిమాలో స్కిన్ షో చేసినట్టు తెలుస్తుంది. మరి ఈ టాలెంటెడ్ యాక్ట్రెస్ కూడా గ్లామర్ షో చేయడం మొదలు పెడితే మాత్రం అవకాశాలు వరుసగా వస్తాయని చెప్పొచ్చు.

# బాబోయ్.. మళ్లీ పెంచేసిన ముద్దుగుమ్మ



రాఘవేంద్ర రావు సినిమా కొత్త పెళ్లి సందడి సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ శ్రీలీలా. ఈ అమ్మడు మొదటి సినిమాతో నిరాశ పరిచింది. పెళ్లి సందడి మినిమం కలెక్షన్స్ ను కూడా రాబట్టలేకపోయింది. అంతే కాకుండా మినిమం పాజిటివ్ రివ్యూలు కూడా రాలేదు. పెళ్లి సందడి ఫెయిల్ అయినా కూడా శ్రీలీలా కు భలే క్రేజ్ దక్కింది. అందంతో పాటు డాన్స్ విషయంలో మంచి మార్కులు పడ్డాయి. అంతే కాకుండా అందమైన ముద్దుగుమ్మ శ్రీలీలా ను చూడగానే చూపు తిప్పుకోనివ్వని అందం ఆమె సొంతం. అందుకే అందమైన శ్రీ లీలా పెళ్లి సందడి ఫ్లాప్ అయినా కూడా ఆఫర్లు దక్కించుకుంది. మొదటి సినిమా ఫెయిల్ అయినా కూడా పారితోషికం పెంచిన ఘనత ఈ అమ్మడికే దక్కింది. ధమాకా సినిమా తో తాజాగా శ్రీలీలా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రవితేజ కు జోడీగా నటించిన ఆ సినిమా తో శ్రీలీలా క్రేజ్ మరింతగా పెరిగింది. దాంతో ఈ అమ్మడు మళ్లీ పారితోషికం పెంచేసింది అంటూ వార్తలు వస్తున్నాయి. శ్రీలీలా కమర్షియల్ గా ధమాకా సినిమాతో సక్సెస్ దక్కించుకున్న నేపథ్యంలో ఈ సారి మరింత ఎక్కువ రెమ్యూనరేషన్ ను పెంచినట్లుగా ఆమె తో సినిమా చేయబోతున్న వారు చెబుతున్నారట.




# ఇస్మార్ట్ నిధి చీరలో అందాల విందు



సవ్యసాచి మరియు మిస్టర్ మజ్ను సినిమాలతో హీరోయిన్ గా టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ నిధి అగర్వాల్. మొదటి రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చుడంతో ఈ అమ్మడి కెరీర్ ముందుకు సాగడం కష్టమే అని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఈ అమ్మడికి ఇస్మార్ట్ సక్సెస్ దక్కడంతో కెరీర్ లో దూసుకు పోతుంది.రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన ఇస్మార్ట్ శంకర్ సినిమా లో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించి మెప్పించిన విషయం తెల్సిందే. ఆ సినిమా సూపర్ హిట్ అయిన వెంటనే పవన్ కళ్యాణ్ కు జోడీగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న హరి హర వీరమల్లు సినిమా లో నటించే అవకాశం దక్కించుకుంది.సినిమాల్లో ఏ స్థాయిలోఅందాలను ఈ అమ్మడు ఆరబోస్తూ ఉంటుందో సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఉంటుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు మంచి కలర్ ఇంకా బాడీ లాంగ్వేజ్ ఉన్న నిధి అగర్వాల్ ఏ ఫొటోలు షేర్ చేసినా కూడా జనాలు వావ్ అనాల్సిందే.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com